క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు: మండలంలోని ఐతోల్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీరాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐతోల్, సిర్సవాడ, పాపగల్, అంతారం, గోవిందాయిపల్లి, ఎట్‌ధార్‌పల్లి, లచ్చిరాంతండా, భల్లాన్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: మండలంలోని సూరాపూర్, కొత్తకుంటపల్లి, మగ్దూంపూర్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సమయ పాలన పాటిస్తూ పాఠశాలకు హాజరు కావాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయండి



అమ్రాబాద్: అచ్చంపేట అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు గురువారం నిర్వహించే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కబాలకిష్టయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాయుద్ధనౌక గద్దర్ పై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వాఖ్యలను నిరసిస్తూ నిరసన ర్యాలీ చేపట్టినట్లు వివరించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరవుతారని తెలిపారు.

బైపాస్ నిర్వాసితులను ఆదుకోవాలి

చారకొండ: మండల కేంద్రంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన బైపాస్ నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లావణ్య గురువారం ఓ ప్రకటనలో కోరారు. బైపాస్‌తో ఎంతో మంది బాధితులు నిరాశ్రయులుగా మారారని, ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సరిపోదని తెలిపారు. ప్రతి బాధితుడికి 500 వందల గజాల ఇంటి స్థలంతో పాటు ఆర్థికసాయం అందించాలని కోరారు.

జాబ్‌మేళాలో 156 మందికి ఉద్యోగాలు




బల్మూర్: మండలంలోని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫాక్స్ కాన్ కంపెనీ హైదరాబాద్ బుధవారం నిర్వహించిన 'జాబ్‌మేళా'లో 156 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పరంగి రవి తెలిపారు. కార్యక్రమంలో ఫాక్స్ కాన్ కంపెనీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్(ఆదర్శపాఠశాల)లో వంట చేసేందుకు హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్‌గా పనిచేసేందుకు ఆసక్తిగల వారు ఈ నెల 6వ నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్ 10వ తరగతి, అసిస్టెంట్ కుక్ 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆదర్శ వసతి గృహంలోని కేర్ టేకర్‌కు దరఖాస్తులను కోరారు.

ఎంపీడీఓ కార్యాలయంలో తాచుపాము



అమ్రాబాద్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోకి బుధవారం మధ్యాహ్నం తాచు పాము ప్రవేశించింది. బుసలుకొడుతున్న పామును చూసి ఉద్యోగులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కార్యాలయ సిబ్బంది సుమన్ దాస్ చాకచక్యంతో పాము పట్టుకున్నాడు. అటవీశాఖ సిబ్బంది సహాయంతో సమీపంలోని అడవిలో వదిలేశారు.

కనులపండువగా రథోత్సవం

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అలువేలు మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పూర్ణాభిషేకం, శేషవాహన సేవ, సూర్యవాహన సేవ, అశ్వవాహన సేవలతో పాటు సాయంత్రం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మయ్య నిర్వాహకులు రంగారెడ్డి, జంగారావు, లింగమయ్య, మల్లయ్య, దేవేందర్, శ్రీనివాసులు, జంగయ్య, బాలరాజు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమవుతాయని ఆలయ పూజారి శేషాచార్యులు తెలిపారు. 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 9 రోజుల పాటు కొనసాగనున్నాయి.



వెల్టూరులో రథాన్ని లాగుతున్న భక్తులు

పూజల వివరాలు

6న ఉదయం అభిషేకం, అలంకరణ, సాయంత్రం అంకురార్పణ, 7న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం గజవాహన సేవ, 8వ తేదీన శేష వాహన సేవ, 9వ తేదీన అనుమార్ వాహనసేవ, 10 తేదీన గరుడ వాహనసేవ, 11వ తేదీన స్వామి వారి కల్యాణోత్సవం, 12వ తేదీన రథోత్సవం, 13వ తేదీన అశ్వవాహన సేవ, 14వ తేదీన హంస వాహన సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.



శ్రీదేవి భూదేవితో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

అచ్చంపేట: ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల చైర్మన్ గంగాపురం రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేకూరిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ గౌరిశంకర్, మార్కెట్ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, నర్సయ్యయాదవ్, మాజీ సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఆమోదంపై హర్షం

నాగర్‌కర్నూల్‌రూరల్: వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తూ బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు దండోర రాష్ట్ర నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా రాష్ట్ర నాయకులు వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు కొంగరి జానయ్య, సిద్ధార్థ, పరశురాములు, కొత్త గంగాధర్, గుడిపల్లి నిరంజన్, అర్జున్, కూరాకుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పన్ను మినహాయింపుతో పేదలకు ఊరట

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు బుధవారం బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బండెల రామచంద్రారెడ్డి, దుర్గాప్రసాద్‌లు మాట్లాడుతూ రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయించి ఇవ్వడం శుభపరిణామం అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేష్‌గౌడ్, కృష్ణగౌడ్, శేఖర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, రవిగౌడ్, శివ, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

ఉప్పునుంతల: కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తూ బుధవారం బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ లబ్ధికోసమేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సైదులుయాదవ్, శ్రీనునాయక్, మహేష్‌యాదవ్, కొండల్‌గౌడ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఉప్పునుంతలలో

భక్తిశ్రద్ధలతో ముగిసిన వార్షికోత్సవాలు



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో సూర్యదేవాలయ ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. స్వామి వారికి అభిషేకం, భగవద్గీత పారాయణం, నిర్వహించారు. భక్తులు వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా శివానందస్వామి భక్తులకు సందేశం ఇచ్చారు. ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. భజనపోటీలలో గెలుపొందిన వారికి షీల్డ్‌తో పాటు, భజన బృందాన్ని సన్మానించారు.

పాఠశాలలో భోజనం ప్రారంభం

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పూజారి హరికృష్ణ శర్మ తన తండ్రి శ్రీనివాస రావు జ్ఞాపకార్థం బుధవారం భోజనాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



కొల్లాపూర్: వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలపీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలపీరు మాట్లాడుతూ నియోజకవర్గంలో విస్తృతంగా వేరుశనగ సాగు జరిగిందని, సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విక్రయాల కోసం నాగర్‌కర్నూల్, వనపర్తికి రైతులు వెళ్లాల్సి వస్తోందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కొల్లాపూర్‌లోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా వరి ధాన్యం విక్రయదారులకు బోనస్ డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, రాముడు, జానకమ్మ, సుభద్ర, రామచంద్రుడు, రాజు తదితరులు ఉన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

అచ్చంపేట: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివజన్ అధ్యక్షుడు పాత్కుల శ్రీశైలం మాట్లాడుతూ డాక్టర్ షమీమ్ అక్తర్ ఇచ్చిన రిపోర్ట్ సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్సీల జనాభా 64 లక్షల కాదని, 85 లక్షల మంది ఉన్నారన్నారు. మాలలకు వ్యతిరేకంగా తీసుకున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిశ్చంద్ర, పాతుకుల శ్యాం సుందర్, కిన్నెర పాండు, పిల్లి సూరయ్య, ఆనంద్, అనిల్‌కుమార్, పిల్లి వెంకటస్వామి, ఇమ్మిడి బాలస్వామి, వెంకటయ్య, రామస్వామి, చెన్నయ్య, గంధం వెంకటస్వామి, మండారి ప్రభాకర్, మండారి దాసు, పెరుమాల పరమేశ్వర్, పర్వతాలు, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పీఏసీఎస్‌ను సందర్శించి నాబార్డు డీడీఎం

ఉప్పునుంతల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)ను బుధవారం నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ మనోహర్‌రెడ్డి సందర్శించారు. సంఘం పనితీరు, అభివృద్ధి, సంఘం ద్వారా అందిస్తున్న సేవలను పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్ రావు, సీఈఓ రవీందర్‌రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీడీఎం మండలంలోని కాంసానిపల్లిలో ఫార్మర్ ప్రొడ్యూస్ సొసైటీ (ఎఫ్‌పీఓ) ఆయన సందర్శించారు.

నేరళ్లపల్లిలో పశువైద్య శిబిరం

తిమ్మాజిపేట: మండలంలోని నేరళ్లపల్లిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 18 పశువులకు సాధారణ చికిత్సలు, 38 దూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు పశువైద్యాధికారి శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, గోపాల మిత్ర మన్మథచారి, పలువురి రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

చారకొండ: మండలంలోని గోకారంలో అనారోగ్యంతో ఏలేటి జగన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు స్థానిక నాయకుల ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. జూపల్లి గ్రామానికి చెందిన చాకలి మల్లమ్మ దశదిన కర్మ సందర్భంగా భాస్కర్ రావు రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్, పరశురాములు, మాజీ ఉప సర్పంచ్ జగపతి, నాయకులు సిరాజ్, అల్లాజి, రవి, గ్రామస్తులు ఉన్నారు.

టీ శాట్ సీఈఓకు సన్మానం

ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌కు చెందిన టీ శాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి బుధవారం స్థానిక పీఏసీఎస్‌ను సందర్శించారు. ఈమేరకు పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు టీ షాట్ సీఈఓను సన్మానించారు. పీఏసీఎస్‌లో నిర్వహిస్తున్న రుణాలు, ఇతర కార్యకలాపాలను చైర్మన్ వివరించారు.

అంతర్గత రోడ్లకు మరమ్మతు



వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బుధవారం గ్రామ నాయకుడు మొక్తాల రమేష్ స్పందించి సొంత ఖర్చులతో హనుమాన్ దేవాలయం నుంచి చెరువు వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతు చేయించారు. సిమెంట్ కాంక్రీట్‌తో పనులు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, రాజేష్ రెడ్డి, రమేష్‌గౌడు, శివరాజ్‌గౌడు, రమేష్‌యాదవ్, ముదిరాజ్ సంఘం చైర్మన్ మహేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

అచ్చంపేట: మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల ఆంజనేయులు(35)పై బుధవారం కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పనినిమిత్తం ఇంటి మిద్దెపైకి వెళ్లగా అకస్మాత్తుగా కోతుల గుంపు ఆంజనేయులుపై దాడి చేశాయి. తలకు తీవ్ర గాయాలు కావడంతో అచ్చంపేట ప్రభుత్వం ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట బుధవారం రాత్రి ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టామన్నారు. లేబర్‌కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. గతంలో రద్దుచేసిన కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు కేఎం నాయుడు, రాములు తదితరులు ఉన్నారు.



నిరసనలో ఆర్టీసీ కార్మికులు

కొత్త రేషన్‌కార్డుల మంజూరుపై అవగాహన

వెల్దండ: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతన రేషన్‌కార్డుల మంజూరుపై పంచాయతీ కార్యదర్శులపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తీక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, ఇటీవల గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలన్నారు.ఎంపీఓ లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనువాస్, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

వట్టెం వెంకన్నకు ప్రత్యేక పూజలు

బిజినేపల్లి : మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నర్సింహ్మారెడ్డి, సుకన్న దంపతులు బుధవారం ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృందం వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల పాలక మండలి అధ్యక్షులు సండడి ప్రతాప్‌రెడ్డి, అనంత నర్సింహ్మారెడ్డి దంపతులను శాలువాతో సన్మానించి సత్కరించారు. గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక సభ్యులు చంద్రారెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. దాదాపు 50 స్టాల్స్, వంద రకాల ఆహార పదార్థాలను, 20 రకాల గేమ్స్‌ను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ తబితారాణి వివిధ స్టాల్స్‌ను పరిశీలించి రుచులను ఆస్వాదించి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ వై.కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ ధర్మ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ యం. అంజయ్య, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాణి తదితరులు పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం



తాడూరు: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలను సాధిద్దామని సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఎస్‌ఐ గురుస్వామిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో కేవీపీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ లాంటి చిత్రపటాలను ముద్రించి వారి నినాదాలతో స్పూర్తిపొందేవిధంగా క్యాలెండర్‌ను రూపొందించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, నాయకులు వెంకటస్వామి, రాంచంద్రయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

వెల్దండ: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం మండలంంలోని బైరాపూర్ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బుధవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్నారు. గుండాల సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు ఢీ కొనడంతో ఆటో బోల్తా

నాగర్‌కర్నూల్ క్రైం: బస్సు ఆటోను ఢీకొనడంతో బోల్తాపడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యాలవాడలో రోడ్డు దాటుతున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొన్నది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఎవరు ప్రయాణికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అధికారులకు వినతి

తెలకపల్లి: మండల కేంద్రంలోని పెద్దచెరువు కింద ఉన్న ఇనాం భూములకు సంబంధించి ఓఆర్‌సీని నిలుపుదల చేయాలని మండల కేంద్రానికి చెందిన బోగరాజు, పసుపుల వంశస్తులైన రైతులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 369, 530, 506, 572 సర్వే నంబర్లలో వ్యవసాయ భూమిని సాగుచేసుకుంటున్నామని వివరించారు. ఇటీవల కొందరు ఇనాం దారులంమంటూ ఓఆర్‌సీకి దరఖాస్తు చేసుకున్నారు. దీనిని ఎట్టి పరిస్థితిలో ఆమోదించకూడదని ఓఆర్‌సీని ఇవ్వొద్దని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మొదటి నుండి కౌలుదారులం తామే అని వివరించారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో రైతులు బాలస్వామి, చంద్రయ్య, నరసింహ, తిరుపతయ్య, నారయ్య, రమేష్, సాయిలు, బక్కయ్య, కృష్ణయ్య ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం సైబర్ నేరాలపై సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి పరీక్షలల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. కొత్త వ్యక్తులకు ఆధార్ నంబర్, ఫోన్‌నంబర్, బ్యాంక్ ఖాతా నంబర్, ఓటీపీలను చెప్పొద్దని కోరారు. విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కురుమూర్తి, ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, పోలీస్ సిబ్బంది గోపి, నవీన్ తదితరులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన అభినయ్ రెండు రోజుల కిందట పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుపడ్డారు. పట్టుబడిన వ్యక్తిని కల్వకుర్తిలో కోర్టులో హాజరుపర్చాగా జూనియర్ సివిల్ జడ్జి కావ్య నిందితుడికి మూడురోజుల జైలుశిక్షతోపాటుగా రూ.100 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీకి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా జిల్లా కేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆలయ ఆవరణలో ఉన్న హుండీలలో చోరీ చేసేందుకు యత్నించారు. హుండీ తెరుచుకోకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయాడు. సీసీ కెమెరాలలో రికార్డు కావడంతో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యువకుడికి గాయాలు

అచ్చంపేట: మండలంలోని నడింపల్లి శివారులో బుధవారం ట్రాక్టర్ అదుపు తప్పి యువకుడు శివ(30)కు తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల అచ్చంపేట-శ్రీశైలం ప్రధాన రహదారిలో బొల్గట్‌పల్లి స్టేజీ సమీపంలో ఇటుక బట్టీల వద్ద ట్రాక్టర్‌తో మట్టిని కలుపుతుండగా ట్రాక్టర్ తిరగబడింది. దీంతో శివ మట్టిలో కూరుకుపోయాడు. రహదారి వెంట వెళ్తున్న వారు గమనించి రక్షించే ప్రయత్నం చేశారు. జేసీబీ రప్పించి మట్టిలో కూరుకున్న యువకుడిని బయటకు తీశారు. చికిత్స నిమిత్తం అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చారకొండ: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కాగుల శీనయ్య పని నిమిత్తం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువా తాళాలు ధ్వంసం చేసి రూ.10వేల నగదును ఎత్తుకెళ్లారు. స్థానికులు ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. క్లూస్ టీం ఘటన స్థలాన్ని పరిశీలించి నమునాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగయ్య తెలిపారు.

భూములు కోల్పోకుండా చూడాలి



బిజినేపల్లి: గతంలో కేఎల్ఐ కాల్వ నిర్మాణం కోసం భూములు కోల్పోయామని ప్రస్తుతం వెంకటాద్రి జలాశయం కోసం భూములు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని వట్టెం రైతులు, గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్‌కు అమరేందర్‌కు విన్నవించారు. బుధవారం వెంకటాద్రి జలాశయంలో కాల్వల నిర్మాణం కోసం గ్రామసభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ హాజరయ్యారు. మరోసారి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని ఖరాకండిగా చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికి ఆమోదమైన నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

మెటీరియల్ పంపిణీ



తెలకపల్లి: విద్యార్థులకు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను బుధవారం మండలంలోని వట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ ఎత్తపు శ్రుతి సొంత డబ్బులతో అందజేశారు. పెన్నులు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు.